# సినిమా న్యూస్

## మల్టీస్టారర్ సినిమాలో చాన్స్
## దక్కించుకున్న కీర్తి సురేష్



నేషనల్ అవార్డ్ విన్నర్, 'మహానటి' కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూనే, బాలీవుడ్‌లో కూడా 'రఫ్తార్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు ఖాతాలో మరో భారీ తెలుగు సినిమా వచ్చి చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 'శంకర్ వరప్రసాద్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు ఒక భారీ మల్టీస్టారర్ కథను సిద్ధం చేశారు. ఇక ఇందులో విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండగా.. కీర్తి సురేష్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం.

అనిల్ రావిపూడి సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాయి, కాబట్టి కీర్తి ఈ సినిమాలో కొత్త మేనరిజమ్స్‌తో అలరించడం ఖాయమని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు షైన్ స్క్రీన్స్ సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. పండగ సీజన్‌లో వెంకటేష్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను, కళ్యాణ్ రామ్ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే బాక్సాఫీస్ దగ్గర రికార్డులు తిరగరాయడం ఖాయం అని చెప్పొచ్చు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్,కీర్తి సురేష్ పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయట.

## పూరీకి 'బిగిసిన ఉచ్చు'
## సినిమాలు బ్యాన్?



పూరీ జగన్నాథ్ చుట్టూ ఇప్పుడు వివాదాలు ముసురుతున్నాయి. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ఆయన, ఇప్పుడు డిస్ట్రిబ్యూటర్ల ఆగ్రహానికి గురవుతున్నారు. 'లైగర్' సినిమా మిగిల్చిన నష్టాల సెగ, తాజాగా మహేష్ బాబు 'పోకిరి' రీ-రిలీజ్‌ను అడ్డుకోవడమే కాకుండా.. పూరీ కెరీర్‌కే ఒక పెద్ద సవాల్‌గా మారింది. మే నెలలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ కోసం ప్లాన్ చేసిన 'పోకిరి' రీ-రిలీజ్ హఠాత్తుగా రద్దయ్యింది, దీనికి కారణం సాంకేతిక సమస్యలు కావు.. కేవలం పూరీ జగన్నాథ్‌పై ఉన్న కోపం. 'లైగర్' వల్ల భారీగా నష్టపోయిన డిస్ట్రిబ్యూటర్లు, పూరీకి సంబంధించిన ఏ సినిమాను థియేటర్లలోకి రానివ్వమని తెగేసి చెప్పారు. ఫలితంగా 'పోకిరి' స్థానంలో మహేష్ బాబు మరో చిత్రం 'అతిథి'ని విడుదల చేయాలని నిర్ణయించారు.

'లైగర్' నష్టాలను భర్తీ చేస్తానని గతంలోనే పూరీ డిస్ట్రిబ్యూటర్లకు మాట ఇచ్చారు, 'డబుల్ ఇస్మార్ట్' సినిమా విడుదల తర్వాత బకాయిలు చెల్లిస్తానని హామీ ఇచ్చినా, ఇప్పటికీ ఆ దిశగా ఎలాంటి అడుగులు పడలేదు, దీనితో విసిగిపోయిన బాధితులు ఇప్పుడు ప్రత్యక్ష పోరాటానికి దిగారు. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్ నేతృత్వంలోని బృందం పూరీపై కఠిన నిర్ణయం తీసుకుంది. తమకు రావాల్సిన బకాయిలు సెటిల్ చేసే వరకు పూరీ జగన్నాథ్‌కు సంబంధించిన ఏ సినిమాను (పాతవి లేదా కొత్తవి) థియేటర్లలో ప్రదర్శించకూడదని నిర్ణయించారు. డిస్ట్రిబ్యూటర్ల యూనియన్ ఇంత గట్టిగా నిర్ణయం తీసుకోవడం టాలీవుడ్‌లో కలకలం రేపుతోంది, ఒకవేళ పూరీ జగన్నాథ్ వెంటనే స్పందించి బకాయిలు చెల్లించకపోతే, ఆయన రాబోయే ప్రాజెక్టులకు పెద్ద చిక్కులు తప్పవని ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## వినాయక్ సంచలన వ్యాఖ్యలు
## చారిని మళ్ళీ చూడనట్టే?



'అదుర్స్ 2' పై క్రియేటివ్ డైరెక్టర్ వి.వి. వినాయక్ సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి. యంగ్ టైగర్ ఎన్టీఆర్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ కల్ట్ క్లాసిక్ 'అదుర్స్' సీక్వెల్‌పై ఆయన పెదవి విరిచారు. రచయిత కోన వెంకట్ ఇటీవల 'అదుర్స్ 2' స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని చేసిన వ్యాఖ్యలపై వినాయక్ స్పందిస్తూ, ఫ్యాన్స్‌కు కాస్త చేదు నిజం చెప్పారు. టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర 'అదుర్స్' సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా అందులో ఎన్టీఆర్ పోషించిన 'చారి' పాత్ర, బ్రహ్మానందంతో ఆయన కెమిస్ట్రీ ఇప్పటికీ మీమ్స్ రూపంలో మనల్ని నవ్విస్తూనే ఉన్నాయి. కొన్నాళ్లుగా ఈ సినిమాకు సీక్వెల్ వస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, దర్శకుడు వినాయక్ క్లారిటీ ఇచ్చారు.

"ఫ్రాంక్‌గా చెప్పాలంటే, ఆ కథ అక్కడితో ముగిసిపోయింది. మళ్ళీ అందులో కొత్తగా చూపించడానికి ఏముంది?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం సీక్వెల్ తీయాలి కదా అని బలవంతంగా తీస్తే, మొదటి భాగం అందించిన గొప్ప అనుభూతిని మళ్ళీ తీసుకురాలేమని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని సినిమాలు హిట్టైనప్పుడు వాటిని ఒక మధుర జ్ఞాపకంగా వదిలేయడమే మంచిదని వినాయక్ మాటల సారాంశం. "మళ్ళీ అంత గొప్పగా తీయగలమన్న నమ్మకం నాకే లేదు.. అందుకే దాని జోలికి వెళ్లకుండా ఉండటమే బెటర్" అని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. దీనితో 'అదుర్స్ 2' కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న నందమూరి అభిమానులకు ఇది కాస్త నిరాశ కలిగించే విషయమే అయినా, ఒక కల్ట్ సినిమా పరువు తీయకూడదనే వినాయక్ నిర్ణయాన్ని విశ్లేషకులు స్వాగతిస్తున్నారు.

## దూసుకొస్తున్న అనిల్ రావిపూడి




టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'హిట్ మెషీన్'గా పేరు తెచ్చుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి.. ఇప్పటివరకు అపజయం ఎరుగని ట్రాక్ రికార్డ్‌తో దూసుకుపోతున్నాడు. మెగాస్టార్ చిరంజీవితో గత సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు'తో ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ అందుకున్న అనిల్.. ఇప్పుడు వచ్చే సంక్రాంతికి మరో బ్లాక్ బస్టర్ కోసం దూసుకొస్తున్నాడు. అయితే, ఈసారి ఒక భారీ మల్టీస్టారర్ చిత్రానికి శ్రీకారం చుడుతున్నారు. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా అదిరిపోయే ఎంటర్టైనింగ్ ఫిల్మ్ చేయబోతున్నాడు. గతంలో అనిల్ రావిపూడి ఈ ఇద్దరు హీరోలతో విడివిడిగా సూపర్ హిట్లను అందుకోగా.. ఇప్పుడు వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూపించబోతుండటంతో అభిమానుల్లో ఈ ప్రాజెక్ట్ భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా? అని ఎదురుచూస్తున్న అభిమానులకు తాజాగా ఒక స్పష్టత వచ్చింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2026 జూన్ చివరి వారం నుంచి ప్రారంభం కానుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తన గత చిత్రాల తరహాలోనే ఈ సినిమాను కూడా అత్యంత వేగంగా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. కేవలం మూడు నాలుగు లాంగ్ షెడ్యూల్స్‌లో చిత్రీకరణను ముగించి, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు వెళ్లాలని చూస్తున్నాడు. ఇప్పటికే.. ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మరి వెంకటేష్ కామెడీ టైమింగ్, కళ్యాణ్ రామ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను తెర పై అనిల్ రావిపూడి ఎలా చూపిస్తాడో చూడాలి.